క్లుప్తంగా

టీఆర్‌పీ సోషల్ మీడియా కన్వీనర్‌గా నితిన్‌గౌడ్


నితిన్‌గౌడ్

కరీంనగర్: తెలంగాణ రాజాధికార పార్టీ (టీఆర్‌పీ) ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా కొత్తపల్లికి చెందిన గుర్రం నితిన్ గౌడ్ నియామకం అయ్యారు. ఈ మేరకు పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ ఆకుల మనోజ్ కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కార్యవర్గం సూచన మేరకు నితిన్‌గౌడ్ నియామకం జరిగిందన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మనోజ్‌కుమార్‌కు నితిన్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఫోన్‌ఇన్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏఆర్‌పీపీ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక సమస్యల పరిష్కారానికి ఉచిత ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు అట్ల శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఫోన్‌ఇన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 9703935321 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వం

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత కొట్టే మురళికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోతుందని, ప్రజావ్యతిరేకత ఉండడంతో సీఎం రేవంత్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో గందరగోళ పరిస్థితులను సృష్టించిన కాంగ్రెస్ పార్టీ ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

చిందు యక్షగాన కళాకారులను ఆదుకోవాలి

కరీంనగర్ కల్చరల్: చిందు కులానికి చెందిన యక్షగాన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ చిందు యక్షగాన కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజవెల్లి కిష్టయ్య ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్లో, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమ కళా ప్రదర్శనలకు అవకాశాలుండేవని, తమ వృత్తి కళాకారులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఉన్న కొద్ది మంది కళాకారులు, కళను ఆదరించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు రాకుండా కుట్రలు చేస్తుందని, బీసీలను మరోసారి మోసం చేసిందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వానికి మొదటి నుంచి చిత్తశుద్ధి లేదనేది కోర్టు నిర్ణయంతో తెలిసిపోయిందన్నారు. ఇప్పటికైనా బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కుట్రలను పసిగట్టి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని, 42 శాతం రిజర్వేషన్ వచ్చేలా కృషిచేయాలన్నారు.

సేవలు భేష్



తిమ్మాపూర్: మానవ సేవే మాధవ సేవ, మాజీ ఎమ్మెల్యే, మానసిక వికలాంగుల ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి నిబద్ధతతో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని నాట్‌కో ఫార్మా లిమిటెడ్ సీఈవో, వైస్ చైర్మన్ నన్నపనేని రాజీవ్ కొనియాడారు. ఎల్ఎండీ కాలనీలోని మానసిక వికలాంగుల పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమున్న వారికి మంజూరైన కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. 'మానసిక వికలాంగులకు సేవ చేయడం గొప్పవిషయమని చాడ వెంకటరెడ్డి ట్రస్ట్ చైర్మన్‌గా చేస్తున్న కృషి సామాజిక బాధ్యతకు ఆదర్శం' అని, భవిష్యత్‌లో ఇలాంటి సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ సహకారం అవసరం..

మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 2014 వరకు ప్రభుత్వం నుంచి గ్రాంట్ లభించేదని. ప్రస్తుతం గ్రాంట్ అందడం లేదని వెల్లడించారు. ఇటీవల మహిళా సంక్షేమ సంస్థ చైర్మన్ అనిత రామచంద్రను కలిసి పాఠశాల అవసరాలను వివరించగా, ప్రయాణ సౌకర్యం కోసం శ్రీనిధి ద్వారా రూ.26 లక్షల బస్సు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జి. కొమురెల్లారెడ్డి, జి. భగవాన్, ప్రేమ్ చంద్, వంశీ, బాలరాజు, అడ్మినిస్ట్రేటర్, ప్రిన్సిపాల్ సతీష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు

- ఉపాధి నిధులు రూ.1.40 కోట్లు మంజూరు
- కంపౌండ్‌వాల్స్, కిచెన్‌షెడ్లు, టాయిలెట్ల నిర్మాణం
- బిల్లుల మంజూరు జాప్యంతో ముందుకు సాగని పనులు


ఫకీర్‌పేట పాఠశాలలో నిర్మిస్తున్న కిచెన్‌షెడ్


ఫకీర్‌పేట పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలల్లోని సమస్యలు గుర్తించి నివారణకు కృషి చేస్తోంది. పలు పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంట గదులులేవు. మరికొన్నింటిలో శిథిలావస్థకు చేరి వినియోగించలేని స్థితిలో ఉన్నాయి. తాగునీటి సౌకర్యమూ లేదు.కరీంనగర్ మండలంలోని కొన్నిపాఠశాలల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనులు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కొన్ని పాఠశాలల్లో చేపట్టిన పనులు సైతం అసంపూర్తిగా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆర్నెళ్లక్రితం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటగదులు, గోడల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గోడలకు రూ.87 లక్షలు, మరుగుదొడ్లకు రూ.21 లక్షలు, కిచెన్ షెడ్లకు రూ.32లక్షల చొప్పున మొత్తం రూ.1.40 కోట్లు మంజూరయ్యాయి. అయితే అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాజీ ప్రజాప్రతినిధులు ముందుకు రాకపోవడంతో పనులను ప్రారంభించలేదు. గతంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేపట్టడంలేదని మాజీ సర్పంచులు తెలిపారు. కేవలం మొగ్దుంపూర్, దుబ్బపల్లి, చామనపల్లి, ఫకీర్‌పేట గ్రామాల్లోని పాఠశాలల్లో మాత్రమే మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

'చే' స్ఫూర్తితో ఉద్యమించాలి


చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు



నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: 'చే' స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ అన్నారు. చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ చేగువేరా పోరాట స్ఫూర్తితో రానున్న రోజుల్లో నేటి విద్యార్థి, యువత, 'విద్యా, ఉపాధి, ఆర్థిక, సామజిక' అసమానతలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. సంఘం నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, అన్వేశ్, బొల్లి సాయి, విశాల్, అజయ్, సాయికుమార్, హర్షిత్ పాల్గొన్నారు.

చేగువేరా స్ఫూర్తితో పోరాడుదాం

చేగువేరా స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాడుదామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో చేగువేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచంలో దోపిడీ లేని సమాజం కోసం ప్రాణాలను లెక్కచేయకుండా 39 సంవత్సరాలకే తనువు చాలించాడని, ఆయన జీవితాన్ని నేటి యువత, విద్యార్థులు అధ్యయనం చేసి సమాజంలోని అసమానతలు, దోపిడీ, పేదరికం లేని వ్యవస్థ కోసం పోరాడాలన్నారు. పదవులు కోసం పార్టీలు మారే ఈ రోజుల్లో క్యూబా దేశ అత్యున్నత మంత్రి పదవికి రాజీనామా చేసి బొలీవియా స్వాతంత్ర్యం కోసం అమెరికా సైన్యంతో పోరాటం చేశాడని పేర్కొన్నాన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, నాయకులు రాకేష్ , రఘు, సన్నీ,రామ్ చరణ్ ,రితీష్ పాల్గొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

కొత్తపల్లి: మల్కాపూర్ 16వ డివిజన్‌లో గురువారం ఓటు చోరీపై చేపట్టిన సంతకాల సేకరణలో కాంగ్రెస్ నాయకులతోపాటు సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ దేశ వ్యాప్తంగా చేస్తున్న ఓటు చోరీని అరికట్టడానికి రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమంలో ప్రజలు భాగస్వాములవుతున్నారని తెలిపారు. అదేవిధంగా రేకుర్తి బుడిగజంగాల కాలనీలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ చేశారు. అర్హులకు ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న చింతల మల్లేశం

కరీంనగర్: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా అధ్యక్షుడిగా చింతల మల్లేశంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. బీసీ కులాల సంక్షేమం కోసం పాటుపడుతానని, నియమాకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థి అంజన్‌కుమార్‌ను అభినందిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్: కరీంనగర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో ట్రినిటీ కళాశాల విద్యార్థి టి.అంజన్ కుమార్ అత్యంత ప్రతిభ కనబరిచి మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. విద్యార్థిని ట్రినిటీ కళాశాలల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వం జారీ చేసిన జీవో లోపభూయిష్టం

కరీంనగర్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆదరాబాదరగా చట్టబద్ధత లేకుండా జారీ చేసిన జీవో నంబర్ 9 పూర్తిగా లోపభూయిష్టంగా ఉండి ప్రభుత్వం అభాసుపాలైందని ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ నాయకుడు అధ్యక్షుడు పోలాడి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. బీసీల జనాభా లెక్కలపై ప్రభుత్వం నియమించిన డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ ఎక్కడా పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని, ప్రభుత్వం సేకరించిన ఎంపరికల్ డాటా నిబద్ధత లేకుండా శాస్త్రీయంగా లేదన్నారు.

కరీంనగర్‌టౌన్: బీసీలకు చట్టబద్ధంగా రావాల్సిన 42 శాతం రిజర్వేషన్లు రాకుండా కాంగ్రెస్ పార్టీ లోపభూయిష్టమైన విధానాలతో కుట్రలు చేసి మోసం చేసిందని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

కాన్షీరాం ఆశయాలను కొనసాగించాలి


నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ కల్చరల్: కాన్షీరాం చేసిన త్యాగాలు, సేవలు, బహుజనుల సాధికారత కోసం చేసిన కృషిని మరువలేమని, ఆయన ఆశయాలను కొనసాగించాలని బీఎస్పీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గొల్ల సతీశ్ అన్నారు. గురువారం బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిల్మ్ భవన్‌లో కాన్షీరాం వర్ధంతి సభలో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి అక్కి బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె ప్రశాంత్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాలి తిరుపతి, జిల్లా కోశాధికారి ఉల్లెందుల మహేశ్ తదితరులున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

శంకరపట్నం: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిందితుల వివరాలు వెల్లడించారు. మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ బాబా, చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన షేక్ అజీమ్ కలిసి మండలంలోని ముత్తారం, కరీంపేట, తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం, చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి, రేగొండలో ఆలయాలు, ఇళ్లతాలాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. పొలాల వద్ద విద్యుత్ మోటర్లు ఎత్తుకెళ్లారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.80వేల నగదు, బంగారం, వెండి, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్సై శేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ సల్మాన్‌ను ఏసీపీ అభినందించారు.

కాంపోజిట్ స్కిల్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్‌లో చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం కాంపోజిట్ స్కిల్ ల్యాబ్‌ను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ మమతారెడ్డి ప్రారంభించారు. ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలను పరిశీలించారు. చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాగ్నోస్పేస్ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. సైన్స్, మ్యాథ్స్ రోబోటిక్స్, టెక్నాలజీ, లైఫ్ స్కిల్స్ విభాగాల్లో 600పైగా ప్రాక్టికల్ కార్యకలాపాలు నిర్వహించే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్‌తో పాటు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైలారం అంగన్‌వాడీలో పోషణ్ అభియాన్

గన్నేరువరం: మండలంలోని మైలారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ కవిత హాజరై మాట్లాడారు. పిల్లలకు ఇంటిలో చేసిన వంటకాలను ఆహారంగా అందించా లని, బయట లభించే ఆహార పదార్థాల్లో చక్కె ర స్థాయి, నూనె అధికంగా ఉంటుందని, దీంతో అనారోగ్యం బారినపడతారని, బెల్లం, నువ్వులు, పల్లీలు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తినిపించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీలే అడ్డుకున్నాయి

గన్నేరువరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకాకుండా ప్రతిపక్ష పార్టీలే అడ్డుకున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునిల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా బీసీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



సాక్షి ఎఫెక్ట్..

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ 60వ డివిజన్ పరిధి ముకరాంపురలోని ఖాళీ స్థలాన్ని ఎట్టకేలకు పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ముకరాంపురలోని రాఘవేంద్రమెస్ పక్కనున్న ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, పొదలు పెరగడంతో పాటు చెత్తాచెదారం పడేస్తుండడంతో పరిసర ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'సాక్షి' వాట్సాప్ కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలకసంస్థ అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో ఖాళీ స్థలంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, పొదలను తొలగించారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

గర్భిణులకు ఉచిత వైద్యసేవలు

- చల్మెడ ఆనందరావు ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు


బాలింతకు బేబీకిట్ అందిస్తున్న లక్ష్మీనర్సింహారావు

కరీంనగర్‌రూరల్: మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు. బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో గురువారం మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు ప్రతినెల వైద్యపరీక్షలు, స్కానింగ్ నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ప్రసవం అనంతరం శిశువు ఆరోగ్య రక్షణకు చల్మెడ బేబీకిట్లు అందజేస్తామని అన్నారు. నెలరోజులపాటు శిశువుకు ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తామని వివరించారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన రోగులను నాలుగు గంటల్లోపు ఆస్పత్రిలో చేర్పించినట్లయితే తగిన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల ఆస్పత్రిలో ప్రసవించిన నలుగురికి చల్మెడ బేబీకిట్లు అందించారు. ఆస్పత్రి డైరెక్టర్ వి.సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఆసీంఅలీ, సూపరింటెండెంట్ రామకృష్ణ ప్రసాద్, వైద్యులు రమాదేవి, మాధవి, కవిత, అర్జుమాండ్ బానో, ప్రశాంత్, శ్రావణ్ పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం సందర్శన


సిబ్బందికి జ్ఞాపికలు అందిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా కొత్తపల్లిలోని తపాలా కార్యాలయాన్ని గురువారం అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు సందర్శించి పరిశీలించారు. తపాలా కార్యాలయంలో నిర్వహించే సేవలను సబ్ పోస్టు మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి తపాలా సేవలు కొనసాగుతున్నాయన్నారు. సబ్ పోస్ట్ మాస్టర్ సంపత్‌కుమార్, పర్యవేక్షకులు, పోస్టల్ సిబ్బందికి జ్ఞాపికలను ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాది రాకేశ్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్

కరీంనగర్: సుప్రీంకోర్టు న్యాయవాది రాకేశ్ కిషోర్‌పై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ప్రజామిత్ర కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో ఆలయ గోడ బయట భాగం మీద విష్ణుమూర్తి విగ్రహానికి మరమ్మతు చేయించాలని సెప్టెంబర్ 15 తేదీన సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా వాదనలకు వచ్చినప్పుడు ఇది యునెస్కో వరల్డ్ హెరిటేజ్, ఆర్కియాలజీ కల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలోని అంశమని, ఇందులో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోరాదని, అట్టి కేసును కొట్టి వేయడం జరిగిందన్నారు. సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన రాకేశ్ కిషోర్ అనే న్యాయవాదిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు నల్లాల కనకరాజు, కాడే శంకర్, మద్దెల రాజేందర్, గజ్జల రవీందర్, జక్కుల బాబు, కునమల్ల చంద్రయ్య, లింగంపల్లి కుమార్, సీహెచ్ రవీందర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న వైద్యుల రాజిరెడ్డి

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతీ నెల ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు రూ.700 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ఏ నెలా విడుదల చేయలేదన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఐదు డీఏలు విడుదల చేసి, 01 జూలై 2023 నుంచి పీఆర్సీ అమలుచేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులోని అక్రమాలను సవరించి, కొత్త ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత డీటీఎఫ్‌పై ఉందన్నారు. సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి, చంద్రమౌళి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.దామోదర్, టి.తిరుపతి పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. గమనించిన ముదిరాజ్లు పోలీసులకు సమాచారం అందించారు. ఎల్ఎండీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.